మ నో ర మ

మే మీవలకు వచ్చివేసితిమి.

అంతట కమలాకరవర్మకుమారుఁడగు విజయసింహుఁడు మహాసైన్యములతో నచ్చట కరుగుదెంచెనను వార్త మా స్కంధావారమును కలంపఁజొచ్చెను. తన తండ్రి యట్లు మా తండ్రిగారిచేత నొంటరిగాఁ జిక్కిపోవుట తెలిసినంతటనే యతఁడు వాయువేగ మనోవేగములతో యుద్ధసన్నద్ధుఁడయి కయ్యమునకుఁ గాలుద్రవ్వుచుఁ గూర్చున్న మా సైన్యముల కట్టెదుటఁ దమ యాశ్వికసైన్యములఁ బట్టించుకొనివచ్చెను. నేను నా స్నేహితులతో మావారి యాలోచనసభకు వచ్చి అందు మా తండ్రియు నామె తండ్రియు కార్యతంత్రనిమగ్నులయి తర్కవితర్కము లొనర్చుకొనుచుండఁ గనుగొంటిని.

మా తండ్రిగా రిట్లనుచుండిరి. "మన మొనర్చుకొన్న ఆ యొడంబడికయున్నదే - అది నిరాటంకముగఁ జరిగిపోవలెను. తామిది ముఖ్యముగ గమనింపవలయు — ఈ పిల్లను మీ రన్నివిధముల భ్రష్టురాలినిగఁ జేసివైచితిరి. మీ మెత్తదనమే యామె నింతకుఁ దీసికొనివచ్చినది. ఇప్పు డామె మిమ్మును మగవాండ్రను ఒక్కవిధముగ నపహాసించుచున్నది. తన్ను దాను వంచించుకొనుటయేగాక తన స్త్రీజాతికి—నాకు, వానికి, ఈ యశేష మానవలోకమునకు అవజ్ఞ యొనర్చుచున్నది. బాలిక యొకతె యీవిధముగ సృష్టిని ధిఃకరించుచు — లోకమును వంచించుచు — ప్రకృతి నాజ్ఞాపించుచుఁ జండశాసనము లొనర్పఁదగినది కాదు. సమయబద్ధయయి ఆమె పరిణయ మాడుట కొప్పుకొనవలెను. లేనియెడల నసిఘాతభయంకరమును, అగ్నితాడనభీభత్సమును అగు నిష్ఠురదండోపాయ మొకటి యుండనేయున్నది. ఆమె యనుమతింపని యెడల నిఁక యుద్ధమైపోవలసినదే."

కమలాకరవర్మ నావంకఁదిరిగి "నీ వేమందువు? లోకసామాన్యభంగుల బోవ నిచ్ఛగింపని మా కుమార్తెను లోకాతీతమగు వైఖరిని సందర్శించి వచ్చితివి. ఇప్పటికిని ఆమెయందు నీకుఁ బ్రేమయున్నదని వినుచున్నాను. కావున నీవిషయమై మన సెట్లున్నదో స్పష్టముగఁ జెప్పివేయుము. నీవును యుద్ధము కావలయు నందువా?"

నే నిట్లంటిని.—"యుద్ధమునకు నే నిచ్ఛగింపను. — మహారాజా, ఇప్పు డంతగ యుద్ధమొనర్పవలసిన యావశ్యకత యేమియున్నది? ఎట్టి ఫలితమునకై యుద్ధమొనర్తుమో అట్టి మహాఫలము యుద్ధమున మన కందకుండబోవునని స్పష్టముగఁ దెలిసియున్నపుడు అట్టి వృథాయాసమునకు సంసిద్ధులమగుటకంటె వెంగలితన మింకొకటి యుండదు. ఇప్పు డీ చేయరాని యుద్ధ

మొనర్చి నేనేమి సాధించినవాఁడనగుదును? పరమపవిత్రములగు మందిరములఁ బాడొనర్చి, గృహములకుఁ జిచ్చువెట్టి, గ్రామములఁగాల్చి, సస్యశ్యామల రమ్యమగు వసుంధరను పీనుఁగు పెంటలుగాఁజేసి మేమీ దేశ మెంత వశమొనర్చుకొన్నను తుదకామె నావశమగుట కవకాశము లేదు. మహాపవిత్రములగు సంసార ద్రుమ కుసుమముల ద్రుంపివేసి,సంసారనిలయముల దగ్ధమొనర్చునప్పుడు వానిపై స్తంభాకారముల నెగయు యుద్ధధూమమునుండి నే నామెకంటె కిప్పటికంటె మూఁడింత లధికముగా రక్కసుఁడనై కానవత్తును. తనకుఁ బంధకరులగు వారి నిప్పుడామె రిత్తతూష్ణీంభావమున నిగ్రహింపవచ్చునుగాని యుద్ధమున బట్టువడి పోయినయెడల నట్టి దౌర్జన్యమున విజయవంతులగువారినిఁ దనకును,యీసర్వమానినీలోకమునకును బరమశత్రువులుగా ద్వేషించుచు నుండిపోవును. కావున నీకార్యము మృదుత్వమున నగునట్లు ముష్కరత్వమునఁ జక్కబఱచుకొనుట కవకాశము లేదు. ఆమె ప్రేమయే నా కైహికమనోరథముగ భావించుచున్నాను. అది యుద్ధమున సిద్ధింపదని స్పష్టముగఁ దెలిసికొనియున్నాను. ఈ రాజ్యమునందలి దుర్గములఁదుత్తునుకలుగఁ బాడుచేసి మీ మహానగరముల నెంత గైవస మొనర్చుకొన్నను ఆమె ప్రణయదుర్గమునుమాత్రము పట్టుకొనుట యసంభవమైపోవును. శిలల రువ్వు మా మహామారణయంత్రములచే, మృత్యు వక్త్ర సంకాశములైన మా శతఘ్నులచే మీ నగరములనెంత చూర్ణీభూత మొనర్చినను, మీ నగరవాసులను మేమెంత నేలకును గోలకును దీసికొనివచ్చినను ఆమెనుమాత్రము స్వాధీనమొనర్చుకొనజాలను. బలవంతముగ నామెను బట్టుకొనినంతమాత్రమున నామె ప్రణయలక్ష్మి నావశమైపోవదు. ఆమె కడకంటికటాక్ష మైహికమనోరథముగ భావించుచున్నాను. ఇప్పు డామెను యుద్ధమున బరాజయ మొందించి, బందీకృతను జేసి, సంకెలలఁగట్టి నా యెదుట కీడ్పించుకొన్నను నా యంతర్వాంఛితము సిద్ధింపదు. ఆమె విషణ్ణచిత్తమునఁ దనకైన భంగపాటులఁ ద్రిప్పికొనుచు తన్నంత పరాభవ మొందించిన యవజ్ఞాగ్రంథమునందలి పుటలఁ దిరుగవేయుచు వానినడుమ గీటకసదృశుఁడనై ప్రాకుచుండు నన్ను తత్పత్రప్రహారమున విగతజీవునిగఁ జేసివేయును. అట్టి సందర్భమున నేను నా యైహికజీవిత ఫలావాప్తికి దూరగుఁడనై పరమపదించి పోవుదునన్నమాట. అంతకంటె మానవులపాలిటి యమదూతయగు యుద్ధదేవత సృష్ట్యాదియందెప్పుడో హతమయి మంచుగడ్డలలో పేరుకొనిపోయియుండు 'మేమత్' లనఁబడు బృహద్రూపములనుండు నుగ్రసత్వములవలె నామమాత్రావశిష్టముగ నొక్కమాఱు నశించిపోవునెడల భద్రమగునని భావించుచున్నాను.

మానవజాతికి యుద్ధములను మించిన మహాపదవిం కొకటి లేదు. సృష్ట్యాదినుండి

మానవులకు యుద్ధనీతియందలి యనర్థము తెలియకను వచ్చుచున్నను దానినే క్షత్రధర్మ ముగ సమస్త కార్యసాధన తంత్రముగ నూహించుచుండుట నాకు మహాశ్చర్యముగ నుండిపోవుచున్నది.

ఆ. బ్రహ్మచేత భూమి పతుల కీధర్మంబు
కల్పితంబు; రాజ్య కాంక్షఁజేసి
తోడి చూలునయునఁ దోఁడబుట్టిన వాఁడు
చంపుచుండుఁ గ్రూర చరితుఁడగుచు.

క. భూమికి ధనధాన్యములకు
భామలకును మానములకుఁ బ్రాభవ ములకుం
గా మించి మీఁదుగానక
శ్రీమదమున మానధనులు చెనకుదు రొరులన్.

అని మనవారు క్షత్రధర్మమున నగుచున్న దుండగముల గుర్తించుచునేయున్నారు. అయినను యుద్ధమున మొదటఁ గత్తిదూయు వారుకూఁడ నవసానమున నదంతయుఁ బ్రాప్తకాలంబయివచ్చిన భూప్రజాక్షయం బనియోఁ, బాపభారమునఁ గ్రుంగిపోవు చున్న భూమి నుద్ధరించుటకై తాము నిమిత్తమాత్రులమగుచుంటిమనియో లేక దాము ధర్మ సంస్థాపకులమై లోకక్షయ కర్తలమగుచుంటిమనియో భావించుచుం దురేమో నేనెఱుంగను.

ఉ. భూమికిఁగాఁగ బ్రాణముల
పోకఁదలంపక రౌద్రఘోరసం
గ్రామము సేయుచుండుదురు
రాజులుదొల్లియు నెంత దీఁపొకో భూమి?

అని రాజుల యుద్ధపిపాసనుగూర్చి విస్మయ పడుచుఁబలికినయుభయకవిమిత్రుఁడగు తిక్కన సోమయాజి యుద్ధోద్యమమందలి యనౌచిత్య మజాతశత్రునిచే నిట్లూహింపఁ జేసియున్నాఁడు.

ఉ. అక్కట లాతులైన పగ
తైనను జంపనకోరనేల? యొం
డొక్క తెఱంగు లేదె అది
యొప్పదె బంధుసుహృజ్జనంబులా
దిక్కననున్న వారు గను
తింపక సంపదకై విధించి దూ
ఱెక్కుట దోసమందుటను
నీ దురవస్థలకోర్వవచ్చునే?

క. జయమగు నోడుదుమను ని
శ్చయ మొక్కఁడు లేదువినుము
సమరమునఁబరా
జయము మరణంబుకంటె హృ
దయస్ఫుటభేదనము సేయుఁ
దథ్యంబనఘా

కావున యుద్ధనీతివలన కార్యసాధన మవస్య మునై తీరునని యెట్లుచెప్పవచ్చును? యుద్ధ వ్యవసాయముల నెల్లప్పుడు ముందంజవేయు మహావీరుఁడయ్యును 'అడిబీరపుతులువ' యని పలువురచేఁ చెప్పఁబడుచు వచ్చిన కర్ణునిగూర్చి యుద్ధాచార్యుఁడగు కృపు డిట్లనుచున్నాఁడు.

గీ. కయ్యమునకె యెపుడుఁ గాలుద్రవ్వదు, కార్య
గతికిఁబోవునీతి యుతులు సమర
మథమసాధనముగ నాడుదు రర్థసం
సిద్ధిఁబొందు తెఱఁగు సేయునెడల.

అందును సమస్తపురుషార్థములకు ముఖ్యోపకరణమనియు మూలమనియుఁ జెప్పఁబడు నర్థాంగీ సంపాదనమున యుద్ధమథమాధమ సాధనముగ భావింపఁదగినది. ఈ సుమకోమలులగు స్త్రీలను క్రూరకర్మాస్పదమగు యుద్ధనీతి కర్గము సేయుట కంటె ముష్కరత్వ మింకొకటిలేదు. కావున మహారాజపుంగవులగు మిమ్ములనిరువురను యుద్ధాలోచనములనుండి విరమింపవలయునని వినయముగఁ బ్రార్థించుచున్నాను. యుద్ధముల జయము దైవాధీనము.

ఆ. కలహామగుడు లక్ష్మిఁ గావించుఁ, బ్రాణహా
నియును జేయునింత నిక్కవంబు,
పలువురొకనికోడి పాఱుట, బల్లిదు
లనదచేతఁ జెడుటయును ఘటించు.

మన యుభయవంశములకును జిరకాలానుగతమైన బాంధవ్యమున్నది. అట్టి మా వ్యాపారమును సామతంత్రోపాయములఁ జక్కబఱచుకొనఁదగినది కాని అన్యోన్యజన వినాశకారియైన యుద్ధోపాయమున నెఱవేర్చుకొనఁదగినదికాదు. యుద్ధమనఁగనది యీదేశమునందలి ప్రజలును ఆదేశమునందలి ప్రజలును దలపడుటవలన నగును గాని మహారాజకంఠీరవులగు మీరిరువురును మల్లయుద్ధమునందువలె దైహికముగ బలాబలముల నిర్ణయించుకొనుటవలన కాదుకద! కావున నుపశమించుట లెస్సయని ధర్మరాజును మోదుపగేలుతోఁ బ్రార్థించుసంజయునివలె.

చ. అఖిల జనక్షయంబయి జ
యాపజయంబులు రెండునుండుదిని
సుఖములుగాని యీపనికి
జొత్తురె యుత్తములట్లుఁగాక యా
నిఖిల సుఖంబులేమిటికి
నీవని వృద్ధజనంబు బాలురన్
సఖులను బంధులన్ గురులఁ
జంపిత యేని దయాపయోనిధీ.

అని మా తండ్రిగారికిఁ దెలుపుకొనుచున్నాను.

మాతండ్రిగారందులకు సమ్మతింపక రూక్షముగ నిట్లుపలికిరి.

"క్షత్రధర్మమున కార్యసాధనము కర్తవ్యమని యెంతదీర్ఘముగ నుపన్యసించితివి!— ఇసీ! నీవాఁడు వాండ్ర నే మెఱుంగుదువు?— ఈ విధముగ నీవు నోటికివచ్చినట్లాడునపుడు మనవాండ్రుచెప్పు వెంగలికథయు విశ్వాసయోగ్యమని భావింతునుకద! నీవెఱుఁగవు

కావున నిపుడైన తెలిసికొనుము—మగవాఁడు వేటకాఁడు. ఆఁడుది యతని కేళీమృగము. బంగారు లేడిని బట్టఁబోయిన శ్రీరామునివలె ధగధగలాడు నాఁడువారి మేనికాంతులకు మన మాకర్షితులమయి వారినిఁబట్టికొన నుద్యమింతుము. అట్లు వారిని వేటాఁడుటయే వారికి మహానందప్రదము. అందులకు వారు మనల గాఢముగఁ ప్రేమింతురు. మనము వారి నెంత యణగఁద్రొక్కి స్వారియొనర్తుమో వారు మనకంతగ వశంవదలయి సౌఖ్యమిచ్చుచు నుండిపోవుదురు. అట్టి వాంఢ్ర వెనకవేసికొని నీవేమేమో యుపన్యసించుచున్నావు. ఇసీ! యెంతసిగ్గు! వారి ప్రకృతుల నెంత మృదుత్వమున్న వారంత కఠినతత్వములఁ ప్రేమింతురు. వారి యంతరాళముల నెంత కోమలత్వమున్న వారంత కర్కశప్రకృతుల సహవాస మభిలషింతురు. రౌద్ర ఘోరసంగ్రామముల వారెంత భీతచిత్తలగుదురో అట్టి సంగ్రామములొనర్చు మహావీరుల వారంతగ నభిలషింతురు. ఎట్టి విక్రమకార్యముల నొనర్చు సాహసము వారియందుఁబూజ్యమో వారట్టి పరాక్రమశీలురవంక కాకర్షిత లగుచుందురు. హింసాకరమగు ఘాతుకములతో ఘోరమయ్యును అభిరామమగు నాహవముల మృత్యుధిక్కార మొనర్చు విక్రమకేళి యొనర్చు మహావీరులు, తూర్యాదిరవములతో జైత్రయాత్ర యొనర్చుచు యుద్ధఘోషములఁగల గుండువడు కాంతాజనములనడుమ కుఱికి రక్తసిక్తమగు కైదండలఁ దమ వధూమణుల వలచి వలపించుచుఁ బాణిగ్రహణము లొనర్చుకొనుచుందురు. ఇదే విధముగ నేను నీతల్లిని బరిణయమాడితిని. సాధుశీల యయ్యు నామె వీరపత్ని — వీరజనని పెండ్లాడిన మహాగుణభూషణయగు నట్టి యువతిని బెండ్లాడవలెను. కాని, యీ కొఱుకంచున్నదే! — కొఱుకరాని యిట్టి కొయ్యతో సాధుమార్గములా? మృదుత్వమా? కృష్ణవర్మ మాటల కనురూపముగ నామె చేతలుండు నెడల—అగ్నివృష్టి గుఱియుచు నాకాశమున నెగుఱు శరభసాళ్వములను పండ్లకావున కుపయోగించు చిన్నవలలచే బట్టుకొన నూహించుటయు, శార్దూలాది యుగ్రసత్వముల సాలెపుర్వులగూండ్ల బంధింప నూహించుటయు వివేకతరముగ భావింపవచ్చును.

మ. కరిరాజున్ బిసతంతు సంతతులచే
గట్టన్ విజృంభించు వా
డురువజ్రంబు శిరీష పుష్పములచే
నూహించు భేదింపఁదీ
పరచింపన్ లవణాబ్ధికిన్ మధుకణ
ప్రాప్తిన్ బ్రవర్తించు ని
ద్ధరణిం మూర్ఖులఁ దెల్పునెవ్వఁడు సుధా
ధారానుకారోక్తులన్.

అని చెప్పిన కవి వెఱ్ఱివాఁడా?"

నే నిట్లు పలికితిని—"నిశ్చయమే. కాని అసాధారణమగు నుద్దండతత్వముల, వివేకమునఁ జక్కఁజేయవలయును. యోధా

గ్రేసరులఁజూడ యువిద లాశర్షితులగుదురని మీ రనుచున్నారు. మీ రనునట్లు మహా యోధలక్షణము లామెయం దేమైనఁగొఱత వడి యున్నగదా ఆమె పరుల ప్రతాపతత్వ ములకు వశంవద యగును? ఎన్నితుపాను లుదయించినను మహాద్రివలె స్త్రీహితమహా రంభమగు తన యుద్యమమునఁ జలింపకుండ నిలువగల చిత్తస్థైర్య మామెయం దున్నది. అట్టి నిష్కంపధైర్యమున నిన్న నడికిరేయి యందామె నిలువఁబడి (కృపాణమును చేతఁ బట్టి ప్రతిజ్ఞయొనర్చు మహావీరులవలె) తనపై విఱచుకొనిపడుచున్న పురుషలోకము నధఃకరించుచు మాట్లాడినది. మహాయోధులుకూడ దలపడుటకు సాహసింపఁజాలని మహోగ్రమారణతంత్రములందైనను ప్రాణ సమర్పణ మొనర్చుటకు వెనుదీయని యమేయతత్వ మామెయందున్నది. "స్త్రీ జనస్వాతంత్ర్యఫలావాప్తికి ప్రహ్లాదకుమా రునివలె నేనెట్టి మరణబాధలనైన ననుగ్రహ ములుగ భావింపగలను. ఒక్కసారి స్వార్థ రహితమగు నాత్మార్పణమున సూక్ష్మముగ ఫలసిద్ధియగుట కవకాశము లున్నయెడల నట్లు పంచత్వమొందుటయే నాకుఁ బరమ ధర్మము. అశేషకాంతాస్వాతంత్ర్య మొక్క కాంతాప్రాణి సమర్పణమున సిద్ధింపఁగలిగిన యెడల నెట్టి మహోగ్ర మారణ తంత్ర మైనను వెనుదీయకుండ సిద్ధపడఁగలను." అని యుత్సాహపూరితముగ నామె చెప్పు కొనియున్నది. అట్టి యప్రమేయతత్వమున కేవల పురుష సాధారణమని మీరూహించు చున్న సాహసము పూజ్యమైయుండునా? మఱియు నిన్నటి నిశీథసమయమునఁ బురుష సైన్యములు తమ్ము ముట్టడించియున్నవని తెలిసినప్పుడు తనకొదవిన మహామర్షమున తమ జన్మస్వాతంత్ర్యముల సంరక్షించుకొని తమయోగ్యతను జగద్విదితముగ నుంచి వేయుటకు తానే కవచియై, ఖడ్గపాణియై రణరంగమున నుఱుక సంసిద్ధముగ నుంటి ననియు, నందొకవేళఁ జచ్చినను స్త్రీ లోకాభ్యుదయమునకై పంచత్వమొందితి నను కీర్తి శాశ్వతముగ నుండిపోవుననియు ధీరస్వాంతయై తన బాలికల హెచ్చరించినది.

"వీరకాంతానురూపమైన యిట్టిధైర్యము స్త్రీప్రకృతి కవమానాస్పదమని తాము భావింపవలదు. ఆపదలందు ధైర్యగుణమును బ్రదర్శించు నభిమానవతులను లోక మా చంద్ర తారకముగ గీర్తించుచు నుండఁదగినది కాని సిగ్గుబిడియములు లేకుండఁ బ్రతి ఘటించుచున్నదని దూషింపఁదగినది కాదు.

"ఇఁక మీరు స్త్రీలగూర్చి యొక్కటే తుడుపుగ నొక్కటే ప్రకృతియని భావించు చున్నారు. పురుషులయం దెట్టియెట్టి భిన్న ప్రకృతులున్నవో స్త్రీలయందును అట్టి భిన్న భిన్నప్రకృతు లున్నవిగాని స్త్రీజాతియంతయు నైసర్గికముగఁ గోమలమనియు విభీతచేతస్క మనియు, పౌరుషాశ్రయమనియు భావింపఁ దగినది కాదు. పుష్పములలో కమలమున కును గలువకును యెంతయంతరముండునో కాంతలలో ఒకకాంతకును వేఱొకకాంత

కును అంతయంతరముండును గాని యిరువురును ఒక్కవిధముగ నుందురని భావింపవలదు. ఒకతె వీరవినోదములఁ గ్రీడించు మహావీరునిఁ గామింపవచ్చును. వేఱొకతె విద్యావినోదముల నానందించు పండితుని ప్రేమింపవచ్చును. మఱొకతె వేదాంతగోష్ఠి నుండు పరమసాత్వికునిఁ బ్రేమింపవచ్చును. ఇంకొకతె విపరీత ప్రకృతినుండు నధమాధమునే వరింపవచ్చును. హృదయ ప్రమోదకరమగు వెన్నెల శుభ్రవస్తువుల పైనను అశుభ్ర పదార్థములపైనను ఒక్కవిధముగనే బ్రకాశించునట్లు, సర్వలోక సంపత్కరమగు స్త్రీ హృదయానురాగము ఉత్తములను హీనులనుగూడ నుత్సాహవంతులుగాఁ జేయుచున్నది.

"వారట్టి యుత్సాహకారిణులగుట వలన నింకను యోగ్యముగ విద్యావివేక సంపన్నలగుటకుఁ జక్కని యవకాశము లున్నయెడల ప్రపంచ మింకను తేజస్వంతమయి సకల కల్యాణ గుణావహమై యుండిపోవును. కావున స్త్రీహిత మహారంభమగు నట్టి యుద్యమమును తనతలకుఁ గట్టికొని ప్రతిస్త్రీ యందును ఆమె తన ప్రతిబింబమునే చూచుచు వారిబ్రదుకే దనబ్రదుకుగా, వారికష్టమే తనకష్టముగా, వారి శ్రేయమే తనశ్రేయముగా, వారి యౌన్నత్యమే తన యౌన్నత్యముగా మనోవాక్కాయ కర్మముల ననుభవమునకుఁ దెచ్చుకొనుచున్నది. అట్లుండుటయె ఆమె బుద్ధికి సమంజసముగ నున్నది. అనితర సాధారణమైన దుస్తరమార్గమునఁ బ్రకాశించుచు నామె తన ప్రతిభావిశేషమును, ప్రజ్ఞాధిక్యమును గాన్పింపఁ జేయుచున్నది. కావున నన్ని కఠిననియమము లుంచుకొని తదనురూపముగ నింతవఱకుఁ బ్రవర్తించి యున్నది. ఇఁక మాయమ్మ యందురా?— ఆమె భూమిపై నవతరించిన యనుకంప దేవత — మూర్తీభవించిన సుగుణరాశి. అప్రమేయ గుణ పూజ్యయగు మాతల్లికిని తదితర కాంతలకును పోలిక లేనేలేదు. భిన్న విద్యుద్ధర్మ యుక్తములగు పదార్థము లాకర్షింపఁబడునట్లు భిన్నభిన్న తత్వయుక్తులగు స్త్రీపురుషు లాకర్షితులయి తమ యైహిక జీవితములకు సంపూర్ణత్వమును, సంతుష్టియు, శాంతియుఁ గలుగఁజేసికొన వలసి యున్నది. లోకమున కాదర్శకరముగ బ్రతుకనెంచువా రిట్లూహింపవలసియున్నను విపరీత చేతస్కులగు మనుష్యు లట్లొనరింపఁ జాలక హృదయవ్యథలఁ బాలయి పోవుచున్నారు. స్త్రీలయెడల జూపింపవలసిన గౌరవమున నొక యర్థభాగమైన వారికిచ్చి మనుష్యుఁడీ లోకమున నెంతవాఁడగుచున్నాఁడో అందొక యర్థభాగమునకైన స్త్రీలు వచ్చు నవకాశము లున్నయెడల నిప్పు డిందిర తమకు 'జన్మహక్కు'గ ఘోషించుచున్న వివాదమును జేయుట కావశ్యకత లేకుండియే యుండును—ఇఁకఁ బ్రకృతాంశము: ఏమియొనర్చినను యుద్ధము మాత్రము వలదు. యుద్ధమైన నేనంతయుఁ గోల్పోవుదును."

కమలాకరవర్మ యిట్లు పలికెను,—

"అవును. నీవు యుక్తియుక్తముగ మాట్లాడితివి.—మహోత్సాహ జనకమగు యౌవనమునఁ బ్రేమించుట యనఁగ నెట్లుండునో నాకుఁ జక్కఁగ జ్ఞాపకమున్నది. కాని నీవలెనే నప్పుడీనిన్ని పాట్లు పడియుండను. సుఖమయమైన ప్రణయజీవితము సులభముగ నాకు వశమైపోయెను —నీవచ్చముగ నిందిర వలెనే చర్చయొనర్చితివి. దేనినిగూర్చియైన పలికిన, చర్చించిన నామెయే చేయవలెను. కాని నీసంభాషణమామె చర్చలకంటె సమంజసమును సమర్థనార్హమునై యున్నది."

అని మాతండ్రిగారితో నిట్లు పలికెను—"తమ పుత్రునియందసాధారణ గౌరవార్హమైన ఘనతయున్నది. వీర పురుషోచితమగు నితనివాక్యములు నాకు మోదావహముగ నున్నవి. అతఁడు మా ఇందిరను పెండ్లాడుటయే నాకభిమతము — ఇంక నింతవఱకు మీరొనర్చిన యాగడమునకు, అనఁగ నా స్వేచ్ఛను నిరోధించి నన్నీవిధముగ నిలిపియుంచినందులకు తమకుమారునకుఁ గీడు వాటిల్ల నుండవలయునను పితృప్రేమ దీనికంతకును మూలము కావునను నాకు మీ రర్హ గౌరవమును జూపించియుండిరి కావునను మీ కుమారునిఁ జూచి మీరొనర్చిన యవజ్ఞ క్షంతవ్యమని భావించుచున్నాను. మీ కుమారునికై నే నేమొనర్చినను యుక్తమే. ఇఁక మాయనుజ్ఞలేకుండ మారాజ్యముపై దండెత్తివచ్చి, మీరిన్ని సైన్యములఁదెచ్చి యిచ్చట పీఠమువేసి నందులకు—నర్తంచరులవలె నడికిరేయి నిట్టి యాగడమున మాదేశ మాక్రమించుకొన్నను, మాప్రజల ధనధాన్య గేహములకుఁ జిచ్చువెట్టక, మా కర్షకుల హింసింపక, మాస్త్రీల బాధింపక, మాగ్రామస్థుల యాహారపదార్థము లపహరింపక కేవల యోగ్యాచరణులై యుండిరి. గావున నేను చెప్పునదేమన—

"మాకుమారుఁడజయుఁడు మా సైన్యాధీశులతో నావల నున్నాఁడు గావున నేనిప్పుడు తమకుమారునిఁ దోడ్కొని యజయునితో మాట్లాడ ననుమతింపవలయునని మిమ్ము గోరికొనుచున్నాను. అతనిని నిరపాయముగఁ బంపివేయుదునని తమ యెదుటఁ బ్రమాణపూర్వకముగ వచించుచున్నాను. నామాటకన్న నజయునిమాట యన్న నిందిర కధికగౌరవము గావున నేదో యొకరీతి నీవ్యవహారమును మనము జక్కఁ బఱచుకొనుట కవకాశముండును. ఇదమిద్ధమని యిప్పుడేమియుఁ జెప్పఁజాలను. కాని యేదో యొకవిధము గోచరింపకుండ నుండదు. మిత్రత్వముననే కార్యసాధన మొనర్చుకొందము.— (అని నామిత్రుల వంకఁదిరిగి)—నాకీవఱకు నతిథులై యుండిన మీరు, మీకు సమ్మతమైన మీరును మాతోవచ్చిన సంతసింతును. మనము నలువుర మొక్క భావమున నొక్క వ్యూహమట్లునిలువఁబడినయెడల బ్రతికూలతత్త్వము లంతగ మనలఁ బ్రతిఘటింపఁజాలవు." అని యారాజు గమనోన్ముఖుఁడయి మాతండ్రి

గారికిఁ బ్రణామ మొనరించుటయు, వారు మనస్సున నిష్టములేకున్నను యెట్టకేలకు మా పోక కనుమతించువారివలె 'ఊఁ' యనిరి.

అంతట మేము నల్వుర మశ్వారూఢులమయి వారి యాశ్వికసైన్యములు నిలిచియున్న తావునకుఁ బయలుదేరితిమి. మార్గమున కిరుగెలంకులనున్న మహోన్నత వృక్షములపై పక్షులవ్యక్త మధురమగు సంగీతశాస్త్రములఁ జదువుచుండఁగ బుష్పనికుంజములనుండి యుత్సాహవర్ధనమగు మలయమారుతము నామానసమునఁ గోరికలీరికలెత్తఁ జేయుచుండెను. నామనోహారిణి నన్వేషించు తహతహతో నేనా యాఁడువారి విద్యాలయమున నేమేమి యొనర్చితినో, నాప్రణయకథ కెట్టియెట్టి భంగపాటు లొనవుచువచ్చెనవో ఆ మహారాజునకుఁ దెలుపుకొంటిని. తనకుమార్తెపై నాకుఁ గల యుత్తమభావమున కాతఁడు నన్నభినందించుచు నా ప్రణయకథకింక భంగపాటొదవకుండ సహాయ మొనర్తునని వాగ్దాన మొసంగెను.

కాని వారి యశ్వసైన్యములఁ గలసికొనునప్పుడు మాయం దట్టి శృంగారభావముల కవకాశము లేకపోయెను. తమరాజు రాకఁ జూచి యాసైన్యములందలి శూర యోధులు స్వాగతపూర్వకముగ జయజయ ధ్వానము లొనర్చిరి. భేరీమృదంగ పణవాది నినాదములతో, మంగళోపకరణ శోభితమగు పుణ్యాహనాదములతో, పరమాశీర్వాదములతో, మాగధగీతములతో, వందిజనస్తోత్రములతో వారిసైన్యములందు పరమాఖిలసుందర సమ్మర్ద మగుచుండగ ముప్వు రాశ్వికనాయకులుముందునకువచ్చి తమరాజునకు స్వాగత సూచకముగఁ బ్రణామ మాచరించిరి.

మొదట వారెవ్వరో యనుకొంటిని కాని వారాతని పుత్రులగు నజయసింహుఁడును, అతని యనుజన్ములగు రామకృష్ణులు నని క్షణములో నాకుఁ దెలిసిపోయెను. నాజీవితమున నట్టి విశాలోరస్కులు, అమితబలులు పంచానన సమభీషణమూర్తులు నగు యువకులఁ జూచియుండను. ఆకవలవారినడుమ నజయుఁ డున్నతుఁడయి రూపురేఖల యందును, సామాన్య వైఖరియందును నా మనోహారిణిని దలంపునకుఁ దెచ్చుచున్నట్లుండెను. వారి తనుత్రాణములును, శిరస్త్రాణములును సూర్యప్రకాశమునఁ ధగధగ మెఱసిపోవుచుండెను. ఆ యుద్ధఘోషముల మహత్వ మేమని చెప్పవచ్చును!— అంతవఱకు యుద్ధమువలదని ఘోషపెట్టియున్న నాయందు సహితమదియొక విధమైన వీరావేశమును కలిగించెను. ఉగ్రమగు కండకాసరమున ప్రతిజంతువునందును బుట్టుచుండు మహామదము నన్ను సహితము యుద్ధోన్ముఖునిగఁ జేయుచున్నట్లుండెను.

అంత నామహారాజు తన ముప్వురు పుత్రులకును సర్వవిషయములును విశదముగఁ జెప్పివేసెను. ఆవిద్యాలయమును,

సమ్మును, మావారిశిబిరమును అతఁడు వ్రేలఁ జూపించుచు మాకథను, తనకథను వారికి వినిపించుచుండఁగ మాయాఁడు వేషములకు, మేము పడిన భంగపాటులకు వారి యందణప శక్యముగాని యపహాస్యతత్త్వ ముదయించుచుండెను. ఎట్టకేలకు మహాకాయుఁడును, మహావీరుఁడును అగు నాయజయసింహుఁ డిట్లు పలికెను.

“మా రాజ్యముపై దాడెత్తివచ్చిరి. దానితో నూరకుండక యతనిని సహితము మీకు ‘ఖైదీ’గా నుంచుకొనిరి. ఎంత యాగడము! అయినను మా తండ్రికి యుద్ధ మసమ్మతము. ఎంతయాగడము! నాకు యుద్ధము కావలయునా, లేదాయన్న —అయిన మీ రా మహారాజునకుఁ జేసిన వాగ్దత్తమున్నది. ఇఁక మా సోదరి. ఆమెయం దొక సత్యవినిశ్చయబుద్ధి యున్నది. అయిన నామె యాశయములు కొంత వియత్పథమున నున్నతముగ, మహోన్నతముగఁ బోవుననుట వాస్తవము. అయినను తగిన యవకాశమును, తదనురూపమగు కాలమును సమకూడిన యెడల, తమ యుద్యమ మెట్టి ఫలితమునకు వచ్చునో జూడవలయును గాని వృథగ తమ్మును తమయుద్యమమును నిందింపవల దనుచున్నది. అట్టి యవకాశము తనకుఁ గలుగునట్లు ఆమె నాచేతఁ బ్రమాణము చేయించుకొనియున్నది. నేనుమాత్ర మా విషయముల నేమంత యెఱుఁగుదును?—ఆమెనుమాత్ర మొక ప్రకృతిమానవభామినిగా దలంపరాదు. తమకైన దురన్యాయముల నామె యేకరువుబెట్టినప్పుడు ఆమెజెప్పిన దంతయు యుక్తమేయని నే నూహించితిని. నిశ్చయముగ నామె యాశయ విహంగములు దుస్తరమార్గముల విహరింప నభిలషించును. అయిన నేమాయె?—భూతభవిష్యద్వర్తమానముల స్త్రీ జాతియందామెను మించిన యలంకార ముండదు. ఆమెయందనితర సాధారణమగు ప్రజ్ఞయున్నది. నిరుపమానమగు ప్రతిభావిశేషమున్నది. తదనురూపముగనే నామె నభినందించెడువాఁడను. కావున నామె యుద్యమ మిది యుక్తమయుక్తమని నిర్ణయించుటది నాకేమి పని? ఆమె కెవ్వరన్న నభిమానమో వారియందత్యంత మధురముగ నుండఁగలదు. కావున నో రాజకుమార! సమంజసమగును కాక పోవును. నేనామె పక్షమున నుండువాఁడను. అట్లుండునని ఆమె నాచేత శపథము చేయించుకొనియున్నది. మహాదేవి ఆలయమున స్వచ్ఛమగు దీపికాప్రకాశమున నా కృపాణమునుబట్టి—ఆదిశంకరుల నుద్దండ వివాదమున జయించిన విదుషీమణియఁట! —ఆమె పేరేదియో నేను మఱచిపోయితిని—ఆమెపై యొట్టువేయించుకొని నే నామె పక్షమున నిలుచునట్లు వాగ్దానమును పొందియున్నది. కావుననిఁక ఫలితమేమనఁగ —ఆమె నిన్ను పెండ్లాడదు కావున నీవింక విరమించుటయే యుక్తము. లేనియెడల మాతండ్రి యొప్పుకొనకున్నను సంగ్రామరంగముననే దానిని నిర్ణయింతము.”

మా ప్రాచీనసమయ మంత సూక్ష్మముగ వదలుకొనుటకు నా మన స్సంగీకరింపకపోవుటచేతను, బుద్ధిహీనమైన యుద్ధమునఁ బరస్పర వైషమ్యము లింకను వృద్ధిచేసికొనుట నా కభిమతము కాకపోవుటచేతను నే నాతనికిఁ దక్షణము ప్రత్యుత్తర మొసంగఁజాలకపోతిని. అంతలో నాకవలవారిలో నొకఁడు మమ్ము రెచ్చగొట్టుటకో యన తన మీసపు వెంట్రుకలవైపునఁ జేయివేసికొనుచు సగ మాత్మగతముగ మాట్లాడుకొనువానివలె "ఆఁడు మగరూపములు! కావుననే తమ యాఁడుగుండియల కనురూపముగ నాఁడువేసముల వేసికొనిరి" అని యుపాలంభింపఁజొచ్చెను.

ఆ యుపాలంభన మసిఘాతమువలె మాకుఁ దగులుటచేతఁ దక్షణము కృష్ణవర్మ యందికొని యేదో ముష్కరముగ జవాబు చెప్పుచుండగ, నే నూరకుండఁజాలక కృష్ణవర్మ నొకచేతఁ బట్టుకొని "ఏదీ, చూతము! ఎవ్వ రెంత పౌరుషవంతులో దెలిసిపోవును. ముువ్వురకు ముువ్వుర ముంటిమి కావునఁ దక్షణమే కలియఁబడి కొట్టుకొందమా?" అని యమర్షమునఁ బంతములు పలుకు బాలురవలె కొంచెము దీవ్రముగఁ బ్రత్యుత్తర మొసంగవలసినవాఁడనైతిని.

అంతట నా మూఁడవయాతఁ డిట్లు పలికెను. "ముువ్వురకును ముువ్వురనుట యేల? అంతకు హెచ్చుగఁ గొట్టుకొనఁగూడదా? ఒడ ల్లింతగా దాఁచుకొనవలెనా?— అందును భువనమాన్యగుణోత్తరయగు మన యుక్క గౌరవప్రతిష్ఠాపనమునకై ముువ్వురము మాత్రమేనా గత్తులఁ దూయవలసినది? మన సేనాంగములలోఁ బ్రతినాయకుఁడును తమ రాజేంద్రునికైన యవజ్ఞ గడగివైచుకొని శాశ్వతమగు కీర్తి నుపార్జింపవలయునని తహాతహా లాడుచున్నాఁడే! కావున నింకను హెచ్చుగఁ బోరాడినఁగాని యిందేమి పసయున్నది? అధమపక్షమునఁ బక్షమున కొక యేబది యోధులైనఁ దలపడి అందెవ్వరు జయింతురో వారే గెలిచినట్లును రెండవవా రోడిపోయినట్లును యేల నిర్ధారింపరాదు?"

అందులకు నే నిట్లంటిని. "ఆహా! అట్లే చేయవచ్చును. కేవలము గాలికిఁబోవు నీ కీర్తికై మనమందఱమును ప్రాణములతో చెలగాట మాడికొనవచ్చును. మన చేతల నభిరామముగ నింద్రధనుఃకళికవలెఁ బ్రకాశింపజేయు నీ 'కీర్తి'కి మన మెంత ఘోరముగనైనఁ జచ్చుట కొప్పుకొనవచ్చును. క్షత్రియులు సుభోచితశయ్యలఁ జచ్చుటకంటె వివృత స్వర్గద్వారమని మనవారు గీర్తించు యుద్ధమున నీ బ్రదుకులఁ జూద మాడి వేయుదము. అయిన నంతమాత్రమున నేమగును? మే మోడిపోవుదుము. సరే. కాని మే మొకవేళ జయించినను తుదకు విఫలమనోరథులము కావలసినదే కాదా? మేము జయించినంతమాత్రమున నామె సమయబద్ధురాలు కాఁజాలదు కద!"

అందులకు కజయుఁడు "అట్లుకాదు. అట్టి యుద్ధఫలితమున కనురూపముగ నామె

కట్టుపడియుండఁదగునని ఆమెకు నచ్చఁజెప్పు భారము నాది. లేఖాముఖమునఁ దగిన కారణముల జెప్పి ఆమె యందులకు బద్ధురాలయియుండునట్లు చేయుదును. దానిపై నామె భావ మెట్లుండినది యే స్వయముగ మీ కందఁజేయుదును" అని పలికెను.

"కాని, అబ్బాయిలు! వినండి!" అని యా వృద్ధరాజేంద్రుఁ డెన్నివిధములు నివారింపఁజూచినను, నీటియం దీద నుద్యమించు బాతుపిల్లలను వలదని వారించు పెంపుడు తల్లి యదకోడిపెట్టవలె నాతఁ డెంత చెప్పినను సంగ్రామప్రియులగు నా రాజకుమారులు వినుపించుకొనకపోవుటచేత నతఁడు హతాశుఁడై మిన్నకుండవలసినవాడయెను.

ఆ తరువాత మే మంతగ భాషింపవలసిన యావశ్యకత లేకపోవుటచేత నా మిత్రులతోఁ గలిసి మా తండ్రిగారి శిబిరమునకు వచ్చివేసితిమి. ఈలోన మా తండ్రిగారు కొంత కథగా నిచ్చిరని తెలిసికొంటిని. ఆ విద్యాలయద్వారమునకు మూఁడుసార్లు వా రొక రాయబారిని బంపి యిందిర సమయభంగ మొనర్పకుండ నుండునో లేదో తెలియఁగోరిరట. ఆ రాయబారి మూఁడుమాఱ్లచ్చటకుఁ బోయియుండెను. మొదటి పర్యాయ మతఁ డచ్చట నెన్ని తూర్యధ్వను లొనర్చినను ఎవ్వ రగుపించలేదు. అతఁడు తలుపులవద్ద నెంత తట్టినను ఎన్ని విధముల నఱచినను ఎవ్వరును రాలేదు. వినిపించుకొనలేదు. రెండవసారి లోననుండి భయంకరమగు నొక కంఠధ్వనితో నొక స్త్రీ యతని నచ్చటనుండి పొమ్మని యదల్చివైచెనఁట. మూఁడవసారి బలవిక్రమసంపన్నులను, విశాలోరస్కులును, వ్యాయామవిద్యాప్రవీణులును అగు నా యెనమండ్రు హారికలును ఒక్కమాఱుగ ద్వారమును దెఱచి ఆ రాయబారిపైఁ బడి, యతని కేశముల నిష్కరుణముగఁ బీకి, బ్రక్కయెముకలఁ బొడిచి, మొగమున గొట్టి యతనిని బ్రాణావశిష్టునిగ నొనర్చిరఁట. వా రట్లాతనిపై నట్టి యత్యాచార మొనర్చుచుండగ నా రాజకుమారి తన విద్యాలయసౌధమున నిష్కంపధైర్యముతో నిలుచుండి సర్వముపలక్షించుచుండెనఁట.

కొండలపై జలవాయుభూతము లొండొంటితోఁ బెనఁగులాడుచుండగ మహారయమునఁ బొంగిపోవు రెండు ప్రచండవాహినులనడుమ నిశ్చలత్వమున నొక గట్టుపై తీవిగ నుండిపోవు మహావృక్షమువలె నామె వైఖరియున్నది.

కాని నా వధూమణిపై సంగ్రామ మొనర్పఁబూన యిచ్చితినని మాతండ్రిగారికిఁ దెల్పినప్పుడు ఆయన మహోత్సాహమునఁ జేతులఁ బఱచుచు యోధకుమారులతోఁ దానును యుద్ధమొనర్చ నవకాశము కలిగినదని బలుకఁజొచ్చిరి కాని, వృద్ధులు, జ్ఞానవృద్ధులునగు వారిమంత్రీశ్వరు లట్టిపద్ధతి యుద్ధనీతికిని రాజనీతికిని గూడ విరుద్ధమని హేతుకల్పన మొనర్చుటచేత నాగ్రహముతో, ననిష్టతతో నట్టి పూనిక

నుండి విరమింపవలసిన వారయిరి. **మామహాయోధవర్గమున** ననేకులుత్సాహమునఁ గృపాణములువట్టి నాకై నాసమయమునకై ప్రాణముల పోకఁదలంపక సంగ్రామమొనర్తుమని ప్రతిజ్ఞయొనర్చిరి.

అంతలో నారాజకుమారి యుద్యానవనమున కీవలపార్శ్వమున మాయాహావవినోదమునకు రంగమును తయారుచేయఁ జొచ్చిరి. ద్వారమునకుఁ జేరియున్న యిత్తడి తలుపులపై 'టొమైరిస్'అను మహారాణిపై 'కైరస్'అను పరిషయన్ చక్రవర్తి విజిగీషార్థము దాడి వెడలినప్పడామె యేమి యొనర్చినదో చిత్రముగఁ దొలువఁబడియుండెను.*ఆయుదయమంతయు వారచ్చటి యుద్ధరంగమును సదునుచేయుటతోఁ గడిచిపోయెను. నడుమనడుమ రాయబారులిచ్చటికిని యచ్చటికినిఁబోవుచు సందేశములను, ధిక్కారములను జేరవేయుచు వచ్చిరి.

తుదకజయసింహుఁడు నాకు వాగ్దత్తమొనర్చిన ఆరాజకుమారి ప్రత్యుత్తరము వచ్చెను. ఉప్పొంగివచ్చు మహోపన్యాసమువలె సుందరమగు నక్షరములలో లిఖింపఁబడియున్న ఆలేఖనందికొని యీ విధముగఁ జదువుకొంటిని.

“అన్నా, అజయా! స్త్రీల కెల్లదేశముల నిరంతరముగ నగుచున్న యవజ్ఞలనుగూర్చి యూహించునప్పుడు నాహృదయ మెట్లు దహించుకొనిపోవుచుండునో నీకు దెలియనిది కాదు. స్త్రీల కినుపచెప్పులదొడగి పరాభవించు చైనావారి దుర్మార్గమునుగూర్చి, పరిణయకాలమున పురుషుఁడు భార్యను చావమోదుట కాతనికి కన్యచేత నందియ్యఁబడు రష్యావారి 'కొఱడాదాన' మహోత్సవమునందలి యాగడమునుగూర్చి, బ్రదికియుండగఁ జెప్పరాని దుష్ప్రభుత్వములఁ జేసి ఆయువుమూడిన 'పీనుఁగల'య్యుండియు బ్రదికియున్న తమస్త్రీలను తమదేహములతో గాల్పించుకొను హిందువుల దౌర్జన్యమును గూర్చి, ఆఁడు శిశువు లుదయించినంతటనే వారికిఁక తగినవరులులభింపరను భవిష్యద్దుర్దశలకైన ననుకంపమున నోటెఱుంగని నెత్తురుకందువులను గంగానదియందలి మొసళ్లనోళ్ల కందించు రసపుత్రమాతల దురంతమును గూర్చి చదువునప్పుడు, ఊహించునప్పుడు,

---

* 'టొమైరిస్'అను రాణియొక్క దేశమును తనస్వాధీన మొనర్చుకొనవలెనని 'కైరస్'అను పరిషయన్ చక్రవర్తి మహాసైన్యములఁ దోడ్కొనిపోయెనఁట. ఆమె సామమార్గమున నెంతచెప్పినను 'కైరస్' వినకపోవుటచేత ఆమె యాతనితో యుద్ధమున హోరాహోరిగాఁబోరి తుదకాతనిని సంపూర్ణముగ పరాజయము నొందించుటయేగాక అతఁడాయుద్ధమునఁ బ్రాణములసహితము బోగొట్టుకొను మహాపదకుఁగూడ పాలుచేసెనట. అట్లు ఖండితుఁడైయున్న యామహారాజు మస్తకమును ఆమె యొక రక్తపుఁదిత్తిలోని కెక్కించి యతని 'రక్తదాహమును' పరిపూర్ణముగఁ దీర్చికొమ్మని యుపాలంబించెనట. తమపై దాడెత్తివచ్చు పురుషులకు భయావహముగ నట్టి చిత్రమాయాఁడువారి విద్యాలయద్వారపు తలుపులపైనున్నదని భావము. ఈకథను 'హెరొడోటస్'అను ప్రాచీనగ్రీకుచరిత్రకారుఁ డభివర్ణించియున్నాఁడు.

చర్చ యొనర్చునప్పుడు నా కపరిమితమైన యమర్షముదయింపకుండ నుండునా?

"అంతేకాదు. నాగరికతా మహావాప్తి నొందియున్న యీకాలమునందుగూడ నిట్టి యాగడముల కనురూపమైన దుచ్ఛత్వము సమస్త వ్యవహారములయందును బురుషుల యందుండి పోవుచున్నది. స్త్రీలకు స్వాతంత్ర్యార్హతలేదనియు, స్త్రీలను కేవల గృహోపకరణ యోగ్యముగఁ జూచుకొనవచ్చుననియు శాస్త్రసిద్ధాంతములు మనుజ జాతికిఁ దలవంపుగ నిప్పటికిని బ్రపంచమును బీడించుచున్నవి. అన్ని దేశములందును, అన్ని జాతులందును ఇట్టి శాసనములు బొమ్మజెముడువలె వ్యాపించిపోయియున్నవి. పూర్వపశ్చిమ మధ్యస్థమగు సమస్తదేశములందును స్త్రీల నణచియుంచుటయే పౌరుష లక్షణముగ భావింపఁబడుచున్నది. పౌరసత్త్వాధికారములపై, స్వపరిపాలనాధికారములకై లక్షలకొలది ప్రజ లాందోళన మొనర్తురుకాని ఒక్కరును స్త్రీ స్వాతంత్ర్యోద్యమమున బద్ధకంకణులైనవారు లేరు.

"అందువలన నేనీ యశేష పురుషలోకమునకును పరాఙ్ముఖనై నాజాతి నున్నతికిఁ దెచ్చుటయే జీవితవ్రతముగ భావించుచు నుండిపోవలసివచ్చినది. పురుషులయాగడ మెంతమాత్రమును చేరఁజాలని దుర్గమస్థాన మొకటి నేనిచ్చట నిర్మించి దాని యభ్యున్నతికై కొన్ని యుగ్రశాసనముల సహితము కాపుగఁ జేసికొంటిని. వాని మహత్త్వమున మేము జిరకాలము ఘాతుక మృగముల బారిఁబడకుండ దప్పించుకొంటిమి.

"స్త్రీల కభివృద్ధి కవకాశములేని గొప్పయెడారివంటి యీ విశాల ప్రపంచమున స్త్రీలకుఁగనులపండువుగ నేనిట్టి ఫలవంతమగు ప్రదేశమును దయారుచేసితిని. అందెల్ల దేశముల నింతవఱకు చెప్పనుఁజేయను జేతనయిన యాఁడువాండ్రెప్పుడెప్పుడే మేమి యొనర్చిరో దెలిసికొనవీలుండునట్టి వస్తువులను, పుస్తకములను, విగ్రహములను ప్రతిష్ఠింపించుకొంటిని

"ఇట్లు మాచదువులలోఁబడి మేముండగా, మాకన్యలవలె వేసములు వేసికొని ముష్కరులగు ముప్వురు పురుషులాగడమున మా విద్యాలయమునఁ జొరఁబడి మాశాంతికి భంగమును కలుగఁజేసిరి. వారిదుండగ మేమనవచ్చును? — పసికూననైయున్నప్పుడయియుండిన సమయభఙ్గమని యొకసాకు గల్పించుకొని ప్రేమయని, వివాహమని— యిట్లు వలవని ప్రేలరిమాటల నాకు మహామర్షమునకుఁ గారణభూతులైరి. కన్నులఁ దెఱువని శైశవప్రాయమున, నాయిష్టానిష్టములతో నిమిత్తములేకుండ జరిగియున్న యీప్రాచీనసమయమునకు నేనేల బద్ధురాల నగుదును? అట్టి యాగడమున నాసమక్షమునకు వచ్చినంతమాత్రమున నా జీవిత వ్రతమునకు నేనేల భంగమును కలుగఁ జేసికొనవలెను?

"మహాఘాతుకమగు సింగముల నేను మచ్చిక యొనర్చితిని. ఇంతటి ఘాతకులగు

పురుషులను నేను మచ్చిక చేసికొనఁజాలక పోవుదునా?

"ఇప్పుడు వీండ్రకెవ్వరు బుద్ధిచెప్పఁదగినది?—మీరా? నేనా? బుద్ధిపూర్వకముగ నాకింత యవజ్ఞయొనర్చిన వీండ్రనిప్పుడు తప్పక శిక్షింపవలెను. ఉగ్మలీజనహిత ప్రారంభమగు నీయుద్యమమునఁ బావనతయు, ఘనతయుఁ, బరిశుద్ధతయు లేదా?

"ఇప్పుడు నేను మాజాతిగౌరవమును, సత్యమును గాపాడుకొనవలసియున్నది. ఇట్టి సందిగ్ధసమయమున జగన్నిర్మాణకారణమగు నాదిశక్తి మనకు జయమీయకుండ నుండదు.

"కావున నజయుఁడ! నీవు సంగ్రామమున నజయ్యుఁడవై మమ్ముఁగాపాడగలవు. నీ పరాక్రమమున నాకు విశ్వాసమున్నది. మఱియుఁ బరమపావనయగు నెట్టి తల్లి గర్భమున నీవుదయించియుంటివో జ్ఞప్తియందుంచుకొని జగమునకు మాతృస్థానమని చెప్పఁబడుచున్న మా స్త్రీజాతి నుద్ధరింపుము.

ఒకవేళ నీవోడినయెడల నేనోడితినని యొప్పుకొని తదనురూపమగు సమయమునకు బద్ధురాలనయ్యెదను. కాని నీవోడిపోవువాఁడవుకావు. అయినను నీవాతని ప్రాణములమాత్రము తీసికొనవలదు. తన ప్రాణములనైన సరకుచేయక నాప్రాణముల నతఁడు కాపాడియుండెను కావునను, అతని తల్లి యింకను జీవించియేయున్నది కావునను నీవాతనిని చంపఁదగదు. కాని యుద్ధమునఁ జక్కఁగ పోరాడుము. చేతికొలది, శక్తికొలది యుద్ధమొనరింపుము. నాప్రియసహోదరులు! స్త్రీహితకాముకులగు దేవతలు మీకు తోడయ్యెదరు గాక!

ఉ. కీర్తనపాత్ర చిత్రమతి
కిల్బిషపావన శీలమున్ జగ
న్నర్తన మూలసూత్రమును
నవ్యవిభూతికి నాలవాలమున్
కీరికి మూలకందమును
కేవలదైవమయైనశక్తి సం
పూర్తి మనోరథంబులును
భూరిజయంబును మీకునిచ్చుతన్.

ఉగ్మలీజనహిత ప్రారంభమగు మాయుద్యమమున మాతోఁ జేర్పఁదగిన పురుషులు మీరొక్కరే. మమ్ము మా చదువుల నుండక్కుండ నడుమవచ్చిన యీ కందిరీగల నావలకుఁగొట్టివైచిన తరువాత భావికాలమున మిమ్మొక్కరినే మేము మా చరిత్రముల కెక్కించుకొని కీర్తించుచుందుము. మీరు యుద్ధమొసర్చు కవచములఁ బరమపావనముగ మా విద్యాలయమునఁ బెట్టికొని, మీ విగ్రహముల సహితము మాకుఁగన్నుల పండువుగఁ బ్రతిష్ఠించుకొందుము. అట్టి భావికాలమున స్త్రీలు తప్పక ముందంజవేసి తమ యోగ్యతను తాము గుర్తింప సమర్థురాండ్రయ్యెదరు. ఇంతవఱకు మగవానితోడిదియుఁ, బిల్లలతోడిదియు లోకముగఁ

దలపోయు స్త్రీలప్పుడు సరియైన స్వేచ్ఛా సౌఖ్యమునుబొంది విజ్ఞానమే ఐహికలోక పరమార్థముగఁ దలంపగల్గుదురు. నేఁడు ప్రపంచమును తమవశముగఁ జేసికొనుచున్న పాశ్చాత్యజాతులయందలి పురుషసింహములవలె తామును పరాక్రమశాలినులయి ఉత్తర దక్షిణ ధృవ మధ్యస్థమగు నీభూగోళము స్వాతంత్ర్యోదయమునఁ బ్రకాశించునట్లు చూడఁగలరు.

మీ సోదరి

ఇందిరాదేవి."

అనియున్న లేఖకుఁదిగువ మఱియు నీ 'హెచ్చరిక' నాకగుపించెను.

"మీశిబిరమున నీతో యుద్ధము నకుపక్రమించువారిలో నెవ్వరును ద్రోహులుండకుండ మొదటఁ జూచికొనుము. మా శాసనధిక్కారమైనది మొదలు మావిద్యాలయ మొక విద్రోహపుఁబుట్టగఁ గానవచ్చుచున్నది. ఈఁతిబాధలవలె నీపురుషులు మాపై విఱచుకొనివచ్చిరి.—ఇట్లు పురుషులచేఁ జుట్టఁబడియున్న స్థితియందీ విద్యాలయమున నుండుటకంటె మాబాలికలు వారివారి యిండ్లయందుండిన బాగుండి యుండునేమొ!—ఇట్టి సందిగ్ధసమయమున నయోగ్యురాలగు నొకతల్లి యిచ్చట వదలిపోయియున్న యొక పసికూన నాకు హృదయ సౌఖ్యావహమై కొంత యాశ్వాసమిచ్చుచున్నది. ఇఁక నెప్పటి కా తల్లి కాపిల్లనీయను. దాని మానసవికాసమునఁ దల్లియని చెప్పఁదగు నామెనే యామె తల్లిగఁ గౌరవింపఁగలదు. నేటి ప్రాతఃకాలమున నొక గంటసేపు దానిని నాయొడియందుఁ గూర్చుండఁ బెట్టికొంటిని. అప్పుడా యనాథబాలిక హస్తములు మృదులముగ నాహృదయమును దడివి యీప్రపంచముపైనా కుదయించిన యాగ్రహవికారమును మటుమాయముగునట్లు చేసివైచెను.— మనకు సంపూర్ణ మనోరథ సిద్ధియగుఁగాక!"

మాతండ్రిగారా లేఖనుజూచి యిట్లనిరి.

"తెలిసియుఁ దెలియనిపట్టుదల! అయిననేమాయె?—మహావిప్లవములఁ జక్రవర్తుల కర్థాంగియయి మహాయోధుల నుదయింపఁ జేయఁగల యుత్తమశక్తి ఆమెయందున్నది. బుద్ధిని దగ్ధపటలమొనర్చి కనులకు విభ్రాంతి నొదవించు మోహమటుంచి కొంచెమూహింపుము. బలహీనుఁడును, హీనప్రకృతియునగు నీకమలాకరవర్మ ఆదియందామె కంత స్వతంత్రమిచ్చి ఆమెనింతగఁ బాడుచేసినాఁడు. పురుషుఁడు బలహీనుఁడైనయెడల ఆఁడుది బలవంతురాలయి సృష్టిని దలక్రిందుగఁ జేసివేయును. భూమియొక్క యుపరిభాగ మెప్పుడెంత స్థిరముగ నుండిపోవునో సృష్టియందీ ధర్మమంత స్థిరముగ నుండిపోవునని భావింపఁదగును.— పొలముదున్నువాఁడు పురుషుఁడు, వంటయింట వంటజేయున దాఁడుది. కత్తిఁ బట్టవలసినది మగవాఁడు, గరిటద్రిప్పవలసిన దాఁడుది. కలముఁబట్టి వ్రాయవలసినవాఁడు

పురుషుఁడు-సూదిబట్టి కుట్టవలసినదాఁడుది. మొదటుపయోగమునకుఁ దెచ్చుకొనవలసిన వాఁడు మగవాఁడు, హృదయ ముపయోగ మునకుఁ దెచ్చుకొనవలసిన దాఁడుది. ఆజ్ఞా పింపవలసినది పురుషుఁడు, ఆజ్ఞప్తురా లాఁడుది. లేనియెడల నంతయు నవకతవక! ఇంటిపెత్తన మాఁడుదానికి వదలివైచిన యెడల మగవాఁడాత్మగేహమునందే నరక బాధ ననుభవించును. ఇఁకఁ బ్రపంచతంత్రము లన్నియు నాఁడువారి వశమై పోయినయెడల సృష్టితంత్రములుగూడ భ్రష్టములయి ప్రళయ మాసన్నమైనదని భావింపవచ్చును.

"కాని నీ విప్పు డామెను సంపూర్ణ ముగ వశమొనర్చుకొనుట కవకాశ మున్నది. పెండ్లియయి నీ వామె నదుపాజ్ఞ లలో నుంచఁగలిగినయెడల, నింటబిడ్డను కుంపటిపాలుచేసి వీథులలో తమ జన్మ స్వాతంత్ర్యములను కూరగాయ లఱచిన ట్లఱువఁబోవు నవివేకపు స్త్రీలవలెగాక వీర కాంతయు, వీరమాతయు ననిపించుకొనుట కవకాశముండును. అందఱామె సౌందర్య వతియనియే చెప్పెదరు. అట్లయిన నానంద కరమే — ఇట్లామెనుగూర్చి పరుసముగ మాట్లాడినందుల కామెయన్న నాకుఁ గిట్ట దని భావింపకుము. ఆమెను యుక్తమైన త్రోవకుఁ దెచ్చు భారము నీయందున్నది. అంతేకాక ఒకమాఱు పెండ్లయిన కాంతల యం దెంతటి మానసికపరివర్తనములైన సూక్ష్మముగ జరిగిపోవును. అట్టి పరివర్తన ములు వారికి సహితము కష్టముగనుండవు. ఇద్దఱు కవలపిల్ల లుదయించినయెడల నామె యవివేక మొక్కతుడుపుగ వదలిపోవును. స్త్రీల వివేకము పిల్లలఁ గనుటయందును వారిని పెంచుటయందును కలదు. దానిని మించిన ప్రజ్ఞయుఁ, బ్రతిభయు స్త్రీలకనా వశ్యకము."

అని మా తండ్రిగారు వారి తత్త్వమున కనురూపముగ మాట్లాడిరి. నేను వారిని వీడ్కొని నా మనోహారిణి వ్రాసిన యంశ ముల—ముఖ్యముగ 'నీ వాతని ప్రాణముల మాత్రము తీసికొనవలదు'—అను వాక్య మును పలుమాఱు భావమునకుఁ దెచ్చు కొనుచు నూహింపఁదొడఁగితిని. మఱియు నేను మా పురోపవనమునుండగ నాకు వినుపించిన "ఆమె నన్వేషింపుచుఁ బొమ్ము. తప్పక నీకు విజయము చేకూరఁగలదు" అను నశరీరవాణి వాక్యములు నాకు స్ఫుర ణకు వచ్చెను.

మా తండ్రిగా రాడిన మాటలను దలంచి,తుదకు నా ప్రణయ గాథకుఁగానున్న పర్యవసానమును గూర్చి యూహింప నారంభించితిని. అప్పుడు మా వంశమును పీడవలె బట్టికొనియున్న ఆ బౌద్ధభిక్షుని శాపము సహితము నాకు జ్ఞాపకమునకు వచ్చెను. మాయందుఁ గేవల మోసపుఁ జాయలకెదుఱుగఁ బోట్లాడు మహావీరుఁ డొక డుదయించి భ్రాంతిమూలకమగు నీ మాయాలోకమునఁ బడిపోవునని గదా యతఁడాడియుండెను? — అని తలంప నారంభించితిని.

అంతటఁ దళుక్కున మా వంశమును బీడవలెఁ బట్టుకొనియున్న ప్రాక్తనశాపము నన్నా వహించినది గావలయు. ఆరాజులు, వారి స్కంధావారములు, ఆ మహిళా విద్యాలయము—అంతయుఁ గపటనాటకములనియు, నైంద్రజాలికదృశ్యములవలె మోసపుఁజాయలనియు భావింపఁజొచ్చితిని. ప్రాచీనయుద్ధరంగములలో నెన్నఁడో చచ్చిన మహావీరులతో పోరాడఁ దలంచుచుంటిననియు, నా జీవితము సహిత మొక కపటస్వప్నమనియు విభ్రాంతాత్ముఁడనై పరిభ్రమింపఁజొచ్చితిని. కాని అట్టి చిత్తవృత్తి నా మనసున నెంత యాకస్మికముగఁ బొడమినదో అంత యాకస్మికముగనే పరిసమాప్తమైపోయెను.

నే నెప్పటివాఁడనయి చూచునప్పటికి మా పోరాటమునకు సర్వమును సంసిద్ధముగనుండెను. శాస్త్రోపదిష్ట ప్రమాణోచిత వృత్తాయతంబును, సపాకృతవృక్షవల్మీకంబును, సమీకృతనిమ్నోన్నత ప్రదేశంబును, దూరీకృతపాషాణశల్యశకలంబును, విరచిత బహువిధ ప్రేక్షాగార మంచకవలయంబును అగు రంగభూమియందు మంగళతూర్యఘోషములవ్యాహతముగఁ జెలరేగుచుండగ నాపక్ష మొక యేబది యాశ్వికవీరులును, అజయుని పక్ష మొక యేబది యాశ్వికవీరులును నిలిచి యుద్ధమునకు సిద్ధమైరి. ఉభయ సైన్యములవారును ప్రేక్షాకాగారములఁ దమ తమ నియమిత స్థానములఁ గూర్చుండిమా యుద్ధవినోదమును దిలకించుచుండగ మే మత్యుగ్రముగఁ దలపడి పోరాడఁ జొచ్చితిమి. తాళ్లవర్షము వలె గుఱ్ఱపు డెక్కలు నేలపై తటతటలాడుచుండగ మే మీఁటెలతోఁ గ్రుచ్చుచుఁ, గత్తులతోఁ బొడుచుచుఁ బ్రతియోధుల డీకొంటిమి.

కేవల వీరరసమయాత్మకులగు యోధవీరులతోఁ గలసి కవచములఁ జించుచు, నెత్తురులురివించుచుఁ, గండలు చెక్కుచు, నెమ్ముల విఱచుచుఁ బోరాడునప్పుడుకూడ నా కది యొక కలవలెనే దోపఁజొచ్చెను. జాగ్రతవస్థయందుఁగూడ నా యుద్ధావినోదమంతయుఁ గలయందగుచున్న విధముగ నుండెను. ఆభీలవేగమున మాపై కుఱుకుచున్న ప్రతివీరుల గుఱ్ఱములు వెనుకకాళ్లపై లేచి నిలుచుండగ దారుణసంఘర్షణమునఁ దనుత్రాణముల నగ్నులుదయించి దీర్ఘమగు నీటెలు దుత్తునికలై నేల కొఱిగిపోవుచుండెను.

ఎంతటి శూలారోపణములైనను, ఎంతటి కృపాణఘాతములైనను కొంద ఱాశ్వికులు కొండలవలె నకంపితులైయుండగ, కొందఱు తూలిపడియు ద్విగుణీకృత ధైర్యమున నురవడించుచుండగ, కొంద ఱధఃపతితులయ్యు తమ గుఱ్ఱములపై కెగసి పరాక్రమించుచుండగ, కొందఱు కూలిపోవు గుఱ్ఱములక్రింద మాయమగుచు బొబ్బరించుచు వచ్చిరి.

అజయసింహుని కిరుపార్శ్వముల మహాబాహువులతో మెఱయు నాకవలివా రెచ్చటఁజూచినఁ దామయై కఠినప్రహారము లొకవర్షముగఁ గురిపింపఁజొచ్చిరి. రౌద్రరస

మహోగ్రముగ నాశ్వికులు నేలకును గోలకును వచ్చి చిందఱ వందఱ యగుచుండగ యాయోధుల నాయజయుఁ డొక్కఁడ దెగటారఁ జేయుచున్నట్లగుచుండెను. శూలములు, కత్తులు, కఠారులు, డాళ్లు—సర్వ మా మహావీరుని ధాటికి నిలువఁజాలక దుత్తుమురై పోవుచుండెను. అతని యెదురెదుర నిలువఁజాలక మా యోధులు కూలిపోవురూపముగ, నొఱగురూపముగ, నేలకొఱగు రూపముగఁ, దన్నికొనెడి రూపముగఁ గానవచ్చుచుండిరి. 'చేతఁ గండ్రగొడ్డలినిబట్టి నిష్కరుణముగ శత్రువులఁ జావఁగొట్టు భార్గవరామునివలె ఘోరాసితో నంత భీభత్సముగ యుద్ధమొనర్చు నీతఁ డతిహీనసత్త్వుఁడగు నా కమలాకరవర్మకు ఉదయించినవాఁడా?— అట్లయిన మన యొడళ్లఁ దండ్రులకంటె తల్లుల భాగమే నత్యధికముగనుండవలయు'నని నే నూహించుకొనునట్లాతఁ డత్యుగ్రసంగర మొనర్చుచుండెను.

కలవోలె, చిత్రమువోలె కానవచ్చు నతనినుండి నే నా విద్యాలయము వంక నుపలక్షించితిని.

ఆ మహాసౌధోపరిభాగమున నచ్చటి విగ్రహముల నడుమ విగ్రహములవలె నిలచియున్న తన స్త్రీలనడుమ నా రాజకుమారి శకుంతల శిశువు నొకచేత నెత్తికొని తేజస్వంతమగు దేవతవలె మా యుద్ధమును తిలకించుచుండెను.

పూర్వకాలమున మహావీరు లాహవ మొనర్చునప్పుడు దేవత లాకాశమున విమానములపై నుపలక్షించుచు శౌర్యాలంకారులగు యోధులపైఁ బూలవర్షములఁ గురిపించువారఁట. కాని యీమె—ఆకటికడెందమున శిలవలె జూచుచు నా పరాజయమును, నా పతనమునుఁ గోరికొనుచు వానికై యనునిమేష మెదురుచూచుచున్నదే! ఈమె నా కెట్టిదేవత! 'ఆరామైనఁ గొంతమే ల్నారాయణ!' యనుకొనుచు నేను నా చూపుల మఱలించి తుములముగ యుద్ధమగుచున్న తావునకు వ్రాలి ఆ కవలవారియం దొకని నేలకుఁ గొట్టివైచితిని. తదుత్తరక్షణమునఁ గృష్ణవర్మ రెండవవానిని సహిత మధఃపతితునిగా నొనర్చివైచెను. నా స్వప్నముల కనురూపముగ నా భావిభాగ్యోదయ ముండదు కావలయు. నా మనోహారిణియగు నింతియే నా యుద్ధమును జూచుచు నేను క్రిందయి పోవలయునని వేయిదేవుళ్ల మొక్కుచుండగ నాకు జయ మెట్లువచ్చును? కావున నామె కన్నులకుఁ జల్లగ నే నిఁక యుద్ధమునఁ గూలిపోవలసినదే!—అని యూహించుకొనుచు 'అయినను నా యావచ్ఛక్తియు వినియోగించి చేయఁగలిగిన దెంతయుఁ జేసివేయుద'మని యనుకొనుచుండగ దీర్ఘబాహుఁడు, నమేయసత్త్వుఁడునగు నా యజయసింహుఁడు తన గుఱ్ఱమును నావంకకు ద్రిప్పి పోరాడఁ జొచ్చెను.

ఇండ్లపై, చెట్లపై, జంతువులపై భయంకరముగఁ బ్రేలి, భూమిని భూప్రజల నొక్కమాఱుగ వణకించివేయు పిడుగుల పిండువలె నయ్యేకవీరుఁడు కఠినప్రహారముల విడువకుండ మాపై వర్షింపఁజొచ్చెను. ఏదియు నతని ధాటిని ప్రతిఘటింపఁజాలకపోయెను. తన దక్షిణనేత్ర మట్లు నన్నరసి ప్రేమించు నా మిత్రుఁడగు పార్థసారథి యొక్కఁడే మా యిరువుర కడ్డముగవచ్చి యతనిని నివారింపఁజూచెను కాని ఆ అజయసింహుఁడు, నోరికండ నాచికొనిన ప్రోఁగుబెబ్బులివలె హుంకరించుచు నొక్క బలవత్ప్రహారమున నతని బుడమి పైఁ బడఁగొట్టెను. దానినిజూచి కృష్ణవర్మ యాతని నాక్రమించి తన చేతుల తీఁట వోవ నతనిని ప్రహరించుచుఁ బరాక్రమింపఁ జొచ్చెను. మా పక్షపు యోధులలోఁ గృష్ణవర్మను మించిన పరాక్రమశాలి లేఁడు. అయిన నాతఁడు సహితము తనకంటె పరక్రమాశాలియగు నజయసింహుని ధాటి కాగఁజాలక నేలకుఁ గూలిపోవలసివచ్చెను. అంతట నేను నా యశ్వమును రెచ్చగొట్టి యజయసింహునిపైఁబడి యుద్ధమొనర్పఁ జొచ్చితిని. గుఱ్ఱము లొండొంటి మెఱసికొనుచుండగ మేము మా చేతుల కొలది, కృపాణముల కొలది, యావేశముల కొలఁది పెనఁగులాడితిమి. భూకంపము లుదయించు నప్పుడు మహాసౌధములు వ్రయ్యలగుట వలనఁ గురియు శిలావర్షమువలె మహోగ్రప్రహారములు నా శిరస్త్రాణమునఁబడి పోఁదొడంగెను. నా యావచ్ఛక్తితోఁ జేతియందలి కృపాణము రెండగున ట్లాతనినిఁ బ్రచండముగఁ గొట్టియు నతనియం దొక త్రుప్పుడును రాల్పఁజాలకపోతిని. అంతటితో నా యందలి కలయు, సత్యమును, చైతన్యమును నాయం దుండకుండ పలాయనమైపోయెను. జాగ్రతస్థితియం దంధకార మలమికొనుచుండగ నేను నేల కొఱగిపోతిని.

ఇది మనోరమ యను వచనకావ్యమున
రాజకుమారి యను కథయందు
మనోరమ యను నామెచేఁ
జెప్పఁబడిన పంచమ
భాగము

విన్నపము

గృహలక్ష్మి దసరాసంచిక

అక్టోబరు మాసారంభమున గృహలక్ష్మి దసరా సంచిక వెలువడును. దానిలో స్త్రీలచే రచియింపబడు వివిధవిషయములకు సంబంధించిన చక్కని పద్య గద్య వ్యాసములు ప్రకటింపబడును. దీని కాంధ్ర విద్వత్సోదరీమణుల సాహాయ్య మత్యంతావశ్యకము. కావున సోదరీమణులెల్ల తమ పద్య గద్య వ్యాసములను త్వరగా బంపి దసరా గృహలక్ష్మి సర్వాంగ సుందరిగా వెలువడునట్లు తోడ్పడుదురని మనవి.

సంపాదకుడు.